ఓం శ్రీసాయిరాం

# భగవాన్ శ్రీసత్యసాయి సేవాసంస్థలు
## ఆంధ్రప్రదేశ్

# 'రావణుని రాజనీతి'

[illegible]

**రచన, దర్శకత్వం**

**M.S. ప్రకాశరావు**

ప్రదర్శకులు

**శ్రీ సత్యసాయియువత, ఆంధ్రప్రదేశ్**

పాత్రలు :

1. రాముడు
2. లక్ష్మణుడు
3. విభీషణుడు
4. రావణుడు
5. రావణుని అంగరక్షకులు - 2

ఓం శ్రీసాయిరాం

# శ్రీ సత్యసాయి సేవాసంస్థలు

## ఆంధ్రప్రదేశ్

# 'రావణుని రాజనీతి'

[illegible]

రచన, దర్శకత్వం :

**యమ్. యస్. ప్రకాశరావు**

ప్రదర్శకులు :

**శ్రీ సత్యసాయి యువత, ఆంధ్రప్రదేశ్**

**పాత్రలు :**

1. రాముడు
2. లక్ష్మణుడు
3. విభీషణుడు
4. రావణుడు
5. రావణుని అంగరక్షకులు - 2

లక్ష్మణుడు : అన్నగారూ! రావణుడు శక్తి పుంజుకొని ఈ రోజు మళ్ళీ యుద్ధానికి వస్తాడు. ఈ రోజే అతన్ని సంహరించాలి. దీంతో భూభారం తీరిపోవాలి. దేవగంధర్వ యక్ష కిన్నెర కింపురుషులందరూ జయ జయ ధ్వానాలు చేయాలి. పుష్పవృష్టి కురిపించాలి.

రాముడు : లక్ష్మణా శాంతించు.. రావణ సంహారం అంత తేలికైన పనికాదు. బహుకష్టతరమైనది.

లక్ష్మణుడు : త్రిలోకాధి వీరులు, పురుషోత్తములు తమకా కష్ట సాధ్యం?

రాముడు : నేను త్రిలోకాధివీరుణ్ణి కావచ్చు. అద్వితీయ శస్త్రసంపద కలిగి ఉండొచ్చు, కానీ రావణుడు ప్రతినిత్యం నవకోటి శివలింగాలకు అర్చనాభిషేకాలు నిర్వహించే మహాభక్తుడు. వేదవేదాంగాలు అధ్యయనం చేసిన సద్బ్రాహ్మణుడు. సంగీత, సాహిత్య సరస్వతీనందనుడు. శస్త్రాస్త్ర కోవిదుడు. చతుర్దశ భువనాలను గడగడలాడించిన మహావీరుడు. మనకు శత్రువు కాబట్టి సామాన్యుడిగా, చులకనగా చేసి మాట్లాడకు - నీకే కాదు, ఇది ఎవ్వరికీ తగదు.

లక్ష్మణుడు : మరి అతణ్ణి జయించడం కష్టం అంటారా?

రాముడు : కష్టమే! కానీ అసాధ్యం కాదు. అన్నిటినీ మించి ఎంతటి మహనీయులైనా అతని దుష్కర్మలు, అతని వినాశనానికి దారితీస్తాయి. అలాగే రావణునికి కూడా అతని పరస్త్రీ వ్యామోహమే అతని మరణానికి కారణమవుతుంది. రామబాణం నుండి కాలకూటధరుడు కూడా అతనిని కాపాడలేడు.

ప్రతి వ్యక్తినీ రక్షించేది అతడు పాలించే సత్యము, అతడు ఆచరించే ధర్మము. మన ధర్మమే మనలను రక్షిస్తుంది. అతడి అధర్మమే అతడి మరణానికి కారణమవుతుంది.

లక్ష్మణుడు : అర్థమైంది అన్నగారూ! శత్రువు గొప్పతనాన్ని కూడా గ్రహించి గౌరవించగలిగిన మీకు నా నమోవాకాలు.

రాముడు : ఆయుష్మాన్భవ

(రావణుడు యుద్ధానికి తరలివస్తాడు, యుద్ధాన్ని సూచించే నేపథ్య సంగీతం వినిపిస్తూ ఉంటుంది.)

Contd...3

రావణ : రామా! కాచుకో, నువ్వూ నీ వానరసేన నా శరాఘాతాలకు భస్మమైపోతారు. ఓం. నమ:శివాయ, ఓం. నమ:శివాయ, ఓం.నమ:శివాయ. (రాముడు బాణాలు వేస్తాడు. రావణుడు వికటాట్టహాసం చేస్తాడు.) చూశావా! రామా! నీ ప్రయత్నమంతా వృథా అవుతోంది. నీ మేలుకై చెపుతున్నాను. విను యుద్ధభూమిని వదలి అయోధ్యనగరానికి మరలిపో.

రాముడు : రావణా! నీ శక్తి తెలిసికొని మాట్లాడు. వృథా ప్రలాపాలు చేయకు. రామబాణాన్ని కాచుకో.

లక్ష్మణుడు : ఎన్ని అస్త్రాలు ప్రయోగించినా. ఇతడు మరణించడంలేదే.. విభీషణా రావణుడు మరణం లేకుండా వరం పొందలేదు కదా!

విభీషణుడు : నరులు, వానరులు అల్పులని మా అన్నగారి అభిప్రాయం. అందుచేత ఆ ఇరువురి చేతిలో తప్ప ఇతరుల చేతిలో మాత్రమే చావులేకుండా వరం కోరుకున్నాడు. అతని మరణానికి ఒక రహస్యం ఉంది. అది రామునికి తెలియచేస్తాను. రామా! రావణుని ఉదరంలో నాభివద్ద అమృతభాండం ఉన్నది. దాన్ని ఛేదించు. అతను మరణిస్తాడు.

రాముడు : సరే!

(రాముడు బాణ ప్రయోగం చేస్తాడు. బాణ ప్రయోగాన్ని సూచించే నేపథ్య సంగీతం రావణుడు ఓం నమ:శివాయ! అని పడిపోతాడు. రావణుని అంగరక్షకులు పట్టుకొంటారు).

రావణుడు : రామా! పరంధామా! నీకు కష్టం కలిగించాను. నన్ను మన్నించు.. ఓం నమ:శివాయ ఓం నమ:శివాయ

రాముడు : లక్ష్మణా! చూశావా మహర్షులు, మహనీయులు తమ చివరిక్షణంలో భగవన్నామస్మరణ చేస్తూ చనిపోవాలనుకొంటారు. కానీ చాలామందికి ఇది సాధ్యం కాదు. కానీ రావణుడు తన ఇష్ట దైవాన్ని స్మరిస్తున్నాడు. చూశారా! ఎంతో పుణ్యాత్ముడికి కానీ ఇటువంటి మరణం సంభవించదు.

చూడు లక్ష్మణా! రావణుడు ఎంతో విజయవంతంగా తన రాజ్యాన్ని పాలించాడు. అతని విజయరహస్యం ఏమిటో తెలుసుకొని రా...

Contd...4

లక్ష్మణుడు : విజ్ఞానఖని, మీరు మా అగ్రజులై ఉండగా ఆ రావణుని.. అడగమంటారా.

రాముడు : అవును. విజ్ఞానం కలిగి ఉండటం ఒక్కటే చాలదు లక్ష్మణా! దానిని ఆచరణలో పెట్టాలి. నాకా అవకాశం రాలేదు. నేనెప్పుడూ రాజ్యాన్ని పరిపాలించలేదు. రావణుడు రాజ్యాన్ని పాలించాడు.

లక్ష్మణుడు : అంత మాత్రం చేత అతనికి రాజనీతి తెలుసంటారా?

రాముడు : లక్ష్మణా! ఒక్క క్షణం రావణుడు నీ శత్రువని మరిచిపో. అతను చేసిన నేరానికి అతనిని శిక్షించాను తప్ప, నాకు రావణునిపై ద్వేషం లేదు. చూడు అతడు తప్పు చేస్తున్నాడని తెలిసికూడా వారించకుండా అతనికోసం లక్షలాది రాక్షసులు ప్రాణాలర్పించారు. ఎందుకో తెలుసా?

లక్ష్మణుడు : తెలియదు.

రాముడు : రావణుడు, తన ప్రజల్ని కన్నబిడ్డల్లా పరిపాలించాడు. వారికోసం స్వర్ణలంకను నిర్మించాడు. అందుకే ఆ విజయ రహస్యం తెలుసుకో.

లక్ష్మణుడు : సరే!
(రావణున్ని సమీపిస్తాడు)

లక్ష్మణుడు : రావణా! నీ విజయరహస్యం ఏమిటో చెప్పు?

రావణుడు : లక్ష్మణా! రఘువంశంలోనే పుట్టావా నువ్వు?

లక్ష్మణుడు : ఏం? నీకేమైనా అనుమానంగా ఉందా?

రావణుడు : అనుమానంగానే ఉంది. అదీకాక, నువ్వు రామచంద్రుడికి తమ్ముడివేనా?

లక్ష్మణుడు : నేను రామచంద్రుడికి ప్రియమైన సోదరుణ్ణి, ఏం? అలా అడుగుతున్నావేం?

రావణుడు : నిన్ను చూస్తే అలా అన్పించడం లేదులే?

Contd...5

లక్ష్మణుడు : ఏం?

రావణుడు : ధర్మమూర్తి రామచంద్రప్రభువు పంపితే వచ్చావు తప్ప, నీకు నీవై రాలేదు అవునా? రాజనీతి గురించి తెలుసుకొనేందుకు వచ్చావు అవునా.

లక్ష్మణుడు : అవును.

రావణుడు : చెప్పేవాడు గురువు. తెలుసుకొనేవాడు శిష్యుడు. అవునా?

లక్ష్మణుడు : అవును.

రావణుడు : మరి గురువు దగ్గర శిష్యుడు ప్రవర్తించవలసిన విధానం ఇదేనా?

రావణుడు : క్షమించండి. మీకు నమస్కారం! ఇప్పుడు రాజనీతి గురించి చెప్పండి.

రావణుడు : చెప్తాను. ఒక్కసారి మీ అన్నగారిని, శ్రీ రామచంద్రమూర్తిని పిలువు.

లక్ష్మణుడు : అన్నగారూ! రావణబ్రహ్మ మిమ్మల్ని పిలుస్తున్నారు.

రాముడు : వేదవేదాంగ కోవిదులు, పరమశివభక్తులు, మహనీయులు, రావణబ్రహ్మకు కోసలదేశాధీశుడు దశరథ చక్రవర్తి కుమారుడు శ్రీరాముని నమస్కారాలు అందుకోండి.

రావణుడు : లక్ష్మణా! చూశావా, తాను త్రిలోకాధివీరుడైనప్పటికీ మీ అన్నగారు శత్రువునని కూడా భావించకుండా నాకు నమస్కరించాడు. ప్రభువుకు పెద్దలపట్ల ఎనలేని గౌరవం ఉండాలి. తాను పండితుడైనా, మహావీరుడైనా, అఖండమైన ఐశ్వర్యం ఉన్నా అహంకరించక అందరిపట్ల వినయాన్ని ప్రదర్శించాలి. రాజనీతిలో మొదటిపాఠం ఇది. రామా! నీ వినయ వందనాలకు నా నమస్కారాలు అందుకో. చేతులు జోడించలేను, మన్నించు.

రాముడు : బాధపడకండి! రావణా! (తలమీద చేయి వేసి రావణుని అనునయిస్తాడు)

Contd...6

రావణుడు : లక్ష్మణా చూడు. తనకు ఎంత అపకారం తలపెట్టినా, రామచంద్రుడు నా పట్ల ఎంతప్రేమ ప్రదర్శిస్తున్నారో చూశావా? ఎవరేం చేసినా, మనసులో ద్వేషభావం పెంచుకోకుండా ఇతరుల తప్పులను క్షమించగలిగే ఓర్పు, నేర్పు ప్రభువుకి ఉండాలి. అవి రామచంద్రుడిలో పుష్కలంగా ఉన్నాయి. ఇదే రాజనీతిలో రెండవ పాఠం.

లక్ష్మణుడు : అర్థమైంది రావణా.

రావణుడు : రామా! నేను చేసిన పొరపాటు వల్ల, అద్భుతంగా నిర్మించిన స్వర్ణలంకంతా చిన్నాభిన్నమై పోయింది. నా తమ్ముడు ఏం పాలిస్తాడు? నా లంకకి పూర్వవైభవం వచ్చేలా, పునర్నిర్మించే ఏర్పాటు చెయ్యి.

రాముడు : ఈ క్షణంలోనే పునర్నిర్మిస్తాను (బాణప్రయోగం చేస్తాడు.)

(అద్భుతం జరిగిన సంగీతం. లక్ష్మణుడు, విభీషణుడు అందరూ ఆశ్చర్యపోతూ చూస్తారు)

రావణుడు : ధన్యోస్మి రామచంద్రా! ధన్యోస్మి నా కళ్ళముందే, నా స్వర్ణలంకకు పూర్వ వైభవం చేకూర్చావు.

లక్ష్మణా! రామచంద్ర ప్రభువుని చూశావా? లంకను పునర్నిర్మించమన్నాను. మరుక్షణంలోనే ఆ పని పూర్తి చేశాడు. ఏదైనా ప్రజలకు మేలు చేయదలచుకుంటే, ఆలస్యం చేయకుండా వెంటనే చేయి. అప్పుడే రాజుగా విజయం సాధిస్తావు. ఇదే రాజనీతిలో మూడవ పాఠం.

లక్ష్మణుడు : చాలా అద్భుతమైన నీతిని సోదాహరణంగా చూపించావు.

రావణుడు : లక్ష్మణా! స్వర్గానికి మెట్లు నిర్మిద్దామనుకున్నాను. ప్రపంచమంతా జయించాను తప్ప, ఆ పని చేయలేక పోయాను. ఎందుకో తెలుసా?

లక్ష్మణుడు : ఎందుకు చేయలేక పోయావు?

రావణుడు : ఎవరు ఆ విషయం గుర్తు చేసినా, రేపు చేద్దాం అని వాగ్దానం చేసేవాణ్ణి.

Contd...7

లక్ష్మణుడు : మరి మర్నాడు స్వర్గానికి మెట్లు నిర్మించలేక పోయావా?

రావణుడు : 'లక్ష్మణా! రేపుచేద్దాం' అని వాయిదా వేసిన ఏ పనినీ నువ్వు జీవితంలో చేయలేవు. అందుచేత 'రేపు' అన్న పదాన్ని నీ మనసులోంచి చెరిపేయి. అప్పుడే నీవు విజయం సాధించగలవు. రాజనీతిలో నాల్గవపాఠం ఇదే.

రామచంద్రా! అపూర్వమైన వినయసంపద, క్షమ, మంచిని వెంటనే చెయ్యాలనే పట్టుదల, నీలో పుష్కలంగా ఉన్నాయి. రాజనీతిని నీకు నేను బోధించవలసిన అవసరం లేదు.

లక్ష్మణా! చూడు నీకు రాజనీతిని చెప్పించాలనే మిషతో శత్రువునని ఆలోచించకుండా నాకు తన దివ్యదర్శన, స్పర్శన, సంభాషణా సౌభాగ్యాన్ని అనుగ్రహించాడు రామచంద్ర ప్రభువు ఆ ప్రభువు అడుగుజాడల్లో నడుచుకో. గొప్ప కీర్తి గడిస్తావు. జై....శ్రీరామ్.....

(రావణుడు నేలకొరిగిపోతాడు. విషాద సంగీతం)